ఈనాడు
తమిళనాడు
సోమవారం అక్టోబరు 21, 2024

బాణసంచా కాల్చేందుకు సమయ పరిమితి

ప్యారిస్, న్యూస్‌టుడే: దీపావళికి బాణసంచా కాల్చేందుకు సమయ పరిమితి విధిస్తూ తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31న రాష్ట్రంలో దీపావళి పండుగ జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు టపాసులు కాల్చవచ్చని పీసీబీ తెలిపింది. ప్రజలు తక్కువ శబ్దం వచ్చే, తక్కువ కాలుష్యాన్ని కలిగించే టపాసులను మాత్రమే కాల్చాలని సూచించింది. జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థల అనుమతితో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో కాల్చేందుకు ఆయా ప్రాంతాల్లోని సంక్షేమ సంఘాలు ఏర్పాట్లు చేయవచ్చని పేర్కొంది. ఆస్పత్రులు, ప్రార్థనా మందిరాలు మొదలైన చోట్ల, వెంటనే మంటలు అంటుకునే ప్రాంతాల్లో కాల్చకూడదని, ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరించింది.

కవరైప్పేట్టై రైలు ప్రమాదంపై కుట్ర కేసు నమోదు


ఘటనాస్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న బోగీలు (పాతచిత్రం)

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: కవరైప్పేట్టై వద్ద ఈనెల 11న బాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు లూప్‌లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొన్న ఘటనలో 19 మంది ప్రయాణికులు గాయపడిన విషయం తెలిసిందే. ఘటన స్థలాన్ని ఎన్‌ఐఏ అధికారులు సందర్శించారు. దీనికి సంబంధించి ఆర్‌పీఎఫ్ కమిషనర్ ఏ.ఎం.చౌదరి దర్యాప్తు చేపట్టారు. 30 మందికి పైగా సిబ్బంది వద్ద విచారణ జరిపారు. ఆదివారం ముగ్గురు డీఎస్పీలతో కూడిన 3 ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఇందులో కుట్ర కోణం ఉందని దర్యాప్తులో తేలింది. దీంతో కుట్ర కేసు నమోదు చేసినట్లు సదరుశాఖ అధికారులు తెలిపారు.


క్రీడాకారులకు ఉపకరణాలు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

రాష్ట్రంలో డీఎంకే పాలన స్వర్ణయుగం

● ఉదయనిధి స్టాలిన్

సేలం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తోందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. ఆదివారం సేలం నెహ్రూ ఆడిటోరియంలో జరిగిన 'మక్కలుడన్ ముదల్వర్' పథకం కింద సంక్షేమ సాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేలం, నామక్కల్ జిల్లాల్లోని 707 గ్రామ పంచాయతీలకు చెందిన 1,500 క్రీడాకారులకు ఉపకరణాలు అందించారు. 3,583 మంది లబ్ధిదారులకు రూ.33.26 కోట్ల విలువైన సంక్షేమ సాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గత లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి సేలం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సేలం మహాత్మాగాంధీ క్రీడా మైదానాన్ని రూ.3.63 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల సౌకర్యార్థం రూ.7.60 కోట్ల వ్యయంతో స్పోర్ట్స్ హాస్టల్ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో రాష్ట్రంలో స్వర్ణయుగం ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రులు రాజేంద్రన్, మదివేందన్, సేలం ఎంపీ సెల్వగణపతి, మేయర్ రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని 40 ప్రాంతాల్లో ట్రెక్కింగ్

● మూడు రకాలుగా విభజన
● త్వరలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

న్యూస్‌టుడే, విల్లివాక్కం

రాష్ట్రంలోని కోవై, నీలగిరి, కొడైక్కానల్ సహా 40 ప్రాంతాల్లో ట్రెక్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిని మూడు రకాలుగా విభజించి త్వరలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నారు. ట్రెక్కింగ్ గైడ్‌లుగా 400 మంది అవసరమైన నేపథ్యంలో 350 మందికి శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉంచారు. షెడ్యూల్ తెగలు, గ్రామ ప్రజలు, పర్యావరణ పర్యాటకాభివృద్ధి కమిటీ, గ్రామీణ అటవీ కమిటీ సభ్యులను 'ట్రెక్కింగ్' చర్యలలో పాల్గొనడానికి ఎంపిక చేశారు. రాష్ట్రంలోని పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు, సమాంతరాలు, కొండ ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాలలో అడవులు విస్తరించి ఉన్నాయి. మొత్తం 30,843.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులున్నాయి. ఇందులో 'యునెస్కో' గుర్తింపు పొందిన ప్రాంతాలైన పశ్చిమ కనుమలు వన్య ప్రాణుల ముఖ్య స్థావరంగా ఉంది. పశ్చిమ, తూర్పు కనుమలు పరిశోధన, ఆధ్యాత్మికతను సూచించిన ప్రాంతాలలో కొండ ఎక్కడానికి అటవీశాఖ ద్వారా అనుమతి ఇస్తున్నారు. అంతేకాకుండా అటవీ శాఖ తరఫున పర్యావరణ పర్యాటక పథకం కింద కొన్ని ప్రాంతాలలో పడవ, వాహన పర్యాటకాలు పని చేస్తున్నాయి. కానీ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 'ట్రెక్కింగ్'కు పేరుతో కొండలు ఎక్కడానికి అనుమతిలేదు.


పశ్చిమ కనుమలు

2018 విషాదంతో చట్టం

నీలగిరి, తేని, కొడైక్కానల్, ఏర్కాడ్ వంటి ప్రాంతాలలో అటవీ శాఖ అనుమతి పొందకుండా ట్రెక్కింగ్‌కి వెళ్తున్నారు. 2018లో తేని జిల్లా బోడినాయకనూర్ సమీపంలోని కురంగణి అడవిలో 39 మందితో కూడిన రెండు బృందాలు కొళుక్కుమలై ప్రాంతంలో కొండ ఎక్కుతున్న సమయంలో కార్చిచ్చుకు 23 మంది బలయ్యారు. ఈ ఘటన దేశంలో సంచలనంగా మారింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ శాఖ తరఫున 2018 అక్టోబరు 12వ తేదీ 'ట్రెక్కింగ్ విధులు-2018 చట్టం కింద క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం కొండలు ఎక్కడానికి సులభతరం, మితమైన, కఠినమైన ఇలా మూడు విధాలుగా విభజించారు. 'ట్రెక్కింగ్'కు వసూలు చేస్తున్న ఫీజు అడవుల అభివృద్ధికి, పర్యాటకానికి ఉపయోగించనున్నట్లు తెలిపింది. ట్రెక్కింగ్‌కు అన్ని విధివిధానాలను క్రమబద్ధీకరించి అధికారుల అనుమతి పొందకుండా అడవులు, వన్యప్రాణులు ఉన్నట్లు ప్రాంతాల్లోకి కొండలు ఎక్కడానికి ఏజెన్సీలు ఏర్పాటు చేయరాదని ప్రకటించింది. అనంతరం కార్యకలాపాలకు టీఎన్‌డబ్ల్యూటీఈసీని ఏర్పాటు చేశారు.

పేర్ల నమోదుకు వెబ్‌సైట్

రాష్ట్రంలోని నీలగిరి, ఈరోడ్, కోవై, కొడైక్కానల్, తిరునెల్వేలి సహా 40 ప్రాంతాలలో పర్యాటకులు అటవీ ప్రాంతంలో కొండలు ఎక్కడానికిగాను పథకాన్ని ప్రారంభించడానికి ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఇందుకోసం 'ట్రెక్కింగ్ పుస్తకా'న్ని తయారు చేశారు. ట్రెక్కింగ్ చేయాలనుకున్నవారు పేర్లు నమోదు చేసుకోడానికి వెబ్‌సైట్‌ను రూపొందించారు. కొండల వివరాలు ఎక్కే ప్రాంతాలు, ఫీజు వంటి వివరాలు ఇందులో ఉంటాయి. ఈ పథకాన్ని ఈ నెలాఖరులోగా ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభిస్తారని సమాచారం. ఈ పథకం ప్రారంభమైతే షెడ్యూల్ తెగలకు చెందినవారు అధికంగా లబ్ధి పొందుతారని టీఎన్‌డబ్ల్యూటీఈసీ అధికారి విస్మిజూ విశ్వనాథన్ తెలిపారు.



ప్రసంగిస్తున్న గవర్నర్

బలమైన నాయకత్వంతోనే దేశ పురోగతి

● గవర్నర్ ఆర్ఎన్ రవి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దేశంలో బలమైన నాయకత్వం ఉంటే అది సాధ్యమవుతుందని తెలిపారు. గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. భారతదేశం 2047లోగా పూర్తిగా అభివృద్ధి చెందేందుకు సాంకేతిక పురోగతి అవసరమన్నారు. తంజావూర్ శాస్త్ర డీమ్డ్ యూనివర్సిటీలో 'శాస్త్ర విజన్-2035' ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం, రూ.60కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పరిశోధన, ఆవిష్కరణలకు అనుసంధాన్ కేంద్రం 3వ, 4వ క్యాంపస్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు శనివారం సాయంత్రం జరిగాయి. పాల్గొన్న గవర్నర్ ఆర్ఎన్ రవి మాట్లాడుతూ... 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందడమే మన దేశ లక్ష్యంగా ఉందన్నారు. అందుకు భారత్ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగమించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందన్నారు. కరోనా సమయంలో భారత్ 150 దేశాలకు వ్యాక్సిన్‌లను అందించిందని తెలిపారు. జీ-20 శిఖరాగ్ర సమావేశానికి అధ్యక్షత వహించి ఆఫ్రికాను కూడా చేర్చినప్పుడు భారతదేశ విధానం ఉద్భవించిందన్నారు. అందరినీ కలుపుకొని సమతుల్య ప్రపంచాన్ని శాశ్వతం చేయడమే భారతదేశ లక్ష్యమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన జాబితాలో 11వ స్థానంలో ఉన్న మనదేశం ఇప్పుడు 5వ స్థానానికి చేరుకుందన్నారు. భవిష్యత్తులో 3వ స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తమిళ తల్లి గీతంపై చర్చకు స్వస్తిపలకాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళ తల్లి గీతంపై చర్చకు స్వస్తి పలకాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై దూరదర్శన్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారని, ఈ సందర్భంగా తమిళ తల్లి గీతం పాడేటప్పుడు ద్రావిడ చరణం వదిలేయడం పెద్ద తప్పన్నారు. అది అజాగ్రత్తతో జరిగిన పొరబాటుగా దూరదర్శన్ వివరణ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇది దూరదర్శన్ యాజమాన్యం చేసిన తప్పని, గవర్నరే చేశారని ఊహించుకుని ఆయన్ని విమర్శించం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ వివాదానికి ఇంతటితో స్వస్తి పలకాలని డీఎంకే నేతలకు సూచించారు.

ఆ అర్హత తిరుమావళవన్‌కు లేదు: ఎల్.మురుగన్

సైదాపేట, న్యూస్‌టుడే: తిరుమావళవన్‌కు సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ విమర్శించారు. చెన్నై ఎగ్మూర్ రైల్వేస్టేషన్ వద్ద భాజపా అసంఘటిత డ్రైవర్ల విభాగం తరఫున నిర్వహించిన ఆయుధపూజలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా భాజపా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ కావాలనే గవర్నర్‌పై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. దూరదర్శన్ యాజమాన్యం చేసిన తప్పుకు తామే బాధ్యత వహిస్తున్నట్లు తెలిపినా గవర్నర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడేందుకు తిరుమావళవన్‌కు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. అరుంధతీయుల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసు వేసిన ఆయన ఎలా దళిత నేత అవుతారని నిలదీశారు. ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని తెలిపారు.


ఆయుధపూజలో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ తదితరులు

ముఖ్యమంత్రి వద్ద సానుకూల రాజకీయాలు నేర్చుకోండి

● ఉదయనిధికి భాజపా సూచన

సైదాపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ వద్ద అనుకూల రాజకీయాలు నేర్చుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు భాజపా సూచించింది. ఇందుకు సంబంధించి తమిళనాడు భాజపా అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో... యువకులకు మార్గదర్శకంగా ఉండాల్సిన ఉదయనిధి గవర్నర్‌ను అగౌరవంగా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్‌ను హేళన చేసే విధంగా ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఉదయనిధి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమంపై దృష్టి సారించకుండా వ్యక్తిగత విమర్శలు, విద్వేష రాజకీయాలు చేయడం, రాజకీయ నాయకులను దూషించడం, ముఖ్యంగా మహిళా నేతలను అవహేళన చేయడం తదితర ఘటనలు అధికమవుతున్నాయని ఆరోపించారు. రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న యువకులకు మార్గదర్శకంగా ఉండాల్సిన సీనియర్ నేతలే తమ వారసులను ఉసిగొల్పి ఇతర నేతలను తిట్టిస్తున్నారని మండిపడ్డారు.

మహ్మద్ ప్రవక్తను కించపరచిన వారిని శిక్షించాలి

ఆంబూరులో ముస్లింల ఆందోళన


ఆందోళనలో పాల్గొన్న ముస్లింలు

వేలూర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రకు చెందిన భాజపా నేత రాంగిర్ మహారాజ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నరసింగ్ ఆనంద్ మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో తరచూ వీడియోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ తిరుపత్తూరు జిల్లా ఆంబూరులోని నేతాజీ రోడ్డులో పెద్ద సంఖ్యలో ముస్లింలు ఆదివారం ఆందోళనకు దిగారు.

గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయాలి: ముత్తరసన్



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: గవర్నర్ ఆర్ఎన్ రవిని రాష్ట్రపతి వెంటనే రీకాల్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కుంభకోణంలో విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి చెన్నై దూరదర్శన్ కార్యక్రమంలో పాల్గొని తమిళ్‌త్తాయి వాల్తు గీతం ఆలపించేటప్పుడు ఒక లైన్ ఆపి ఆలపించడం అనుకోని విధంగా జరిగింది కాదన్నారు. ఇందుకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. ఆయనను రాష్ట్రపతి వెంటనే రీకాల్ చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన అత్యున్నత పదవుల్లో గవర్నర్ పదవి ఒకటని, అందుకు తగ్గట్లు ఆయన నడుచుకోవడం లేదన్నారు. డీఎంకేతో కమ్యూనిస్టు పార్టీలకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. హిందీ మాసం జరుపుకోవడం తప్పుకాదన్నారు. కానీ ఆ భాషకు ఇచ్చే ప్రాధాన్యత మిగిలిన 22 భాషలకు ఇవ్వాలనే తాము కోరుతున్నామని పేర్కొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి జిల్లా తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఆదివారం చెన్నైకు చెందిన శివకుమార్ బృందం కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. కార్యక్రమంలో ఏవో ఖాదర్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు మరిన్ని ప్రయత్నాలు అవసరమని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. చెన్నై కేళంబాక్కం సమీప మేల్‌కోట్టైయూరులోని తమిళనాడు క్రీడా, వ్యాయామ కళాశాలలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తమిళనాడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ తరఫున జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రత్యేక అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో దిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక తదితర పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా అన్బుమణి విలేకర్లతో మాట్లాడుతూ... రెండు లక్షల జనాభా కలిగిన దేశాలు క్రీడల్లో ఎక్కువ పతకాలు సాధిస్తుంటే 110 కోట్ల జనాభా కలిగిన మన దేశం చాలా తక్కువ సాధించడం బాధాకరమన్నారు. తమిళనాడులో క్రీడా మైదానాలు తక్కువగా ఉన్నాయని, కొన్ని పాఠశాలల్లోనే ఉన్నాయని, ప్రైవేటు పాఠశాలల్లో అసలే లేవని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైదానాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని వాలీబాల్ అసోషియేషన్ తరఫున కోరుతున్నానని తెలిపారు.



మాట్లాడుతున్న అన్బుమణి రామదాస్



వేదికపై సీనియర్ నేతలు

'మయూరా జయకుమార్‌ను పార్టీ నుంచి తొలగించాలి'

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు నగర కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు మాట్లాడుతూ... పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు మయూరా జయకుమార్ సీనియర్లను గౌరవించడంలేదని ఆరోపించారు. అందువల్లే అతను 2011, 2016, 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారని పేర్కొన్నారు. ప్రజల మద్దతు పూర్తిగా కోల్పోయిన ఆయన్ను పార్టీ నుంచి తొలగించాలనే తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. తీర్మానాల నకళ్లను టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగైకి పంపించారు.


ఒడ్డున నిలిపిన ఫైబర్ బోట్లు

బోట్ హౌస్‌లో పడవ షికారు నిలిపివేత

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరం సమీప పిచ్చావరంలో అటవీశాఖ తరఫున బోట్ హౌస్ నడుస్తోంది. ఇక్కడున్న పర్యాటక కేంద్రంలో ఔషధ గుణాలు కలిగిన మడ అడవులు ఉండటంతో దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వచ్చి పడవ విహారం చేస్తూ ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున పిచ్చావరంలోని బోట్ హౌస్‌లో పడవ షికారు నిలిపేశారు.

నటరాజస్వామి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

వేళచ్చేరి: కడలూర్ జిల్లా చిదంబరంలోని ప్రసిద్ధ నటరాజస్వామిని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ శనివారం రాత్రి దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయం తరఫున ఆలయ కమిటీ కార్యదర్శి వెంకటేశ దీక్షితులు నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట కడలూర్ జిల్లా న్యాయమూర్తి జవహర్, చిదంబరం, విరుదాచలం కోర్టుల న్యాయమూర్తులు ఉన్నారు.


జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దీక్షితులు

చెన్నై చేరుకున్న డ్రైవరు రహిత మెట్రో రైలు

న్యూస్‌టుడే, వడపళని

చెన్నై మహానగరంలో మెట్రో రెండో దశ మార్గం పనులు మూడు వేర్వేరు మార్గాల్లో చురుగ్గా జరుగుతున్నాయి. రెండో దశ నాలుగో మార్గమైన పూనమల్లి బైపాస్ నుంచి లైట్ హౌజ్ వరకున్న మార్గంలోని పోరూరు వరకు వచ్చే ఏడాదిలో ప్రారంభించాలనేది ప్రభుత్వం, సీఎంఆర్ఎల్ ఆలోచన. ఈ క్రమంలో పోరూరు వరకు ట్రాక్ నిర్మాణం, విద్యుద్దీకరణ, ఇతర పనులు వేగం పుంజుకున్నాయి. ట్రయల్ రన్ నిర్వహించేందుకు తొలి డ్రైవరు రహిత రైలు ఆంధ్రప్రదేశ్ శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ సంస్థ నుంచి చెన్నైకి చేరుకుంది. మూడు బోగీలతో కూడిన 36 రైళ్లు ఇక్కడి నుంచి సరఫరా కానున్నాయి.


డ్రైవరు రహిత మెట్రో రైలు



శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ సంస్థ

మెట్రోపాలిస్ పేరుతో తయారీ

మెట్రోపాలిస్ పేరుతో సంస్థ రైళ్ల తయారీ ప్రారంభించింది. ఫిబ్రవరికల్లా 36 డ్రైవరు రహిత రైళ్లను సరఫరా చేయనుంది. ఈ రైళ్లు పూనమల్లి బైపాస్ నుంచి లైట్‌హౌజ్ వరకు 26 కిలోమీటర్ల దూరం వరకు నడుస్తాయి. ఆటోమేటిక్ ట్రెయిన్ ఆపరేషన్ (ఏటీవో), ఆటోమేటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) విధానంతో తయారు చేస్తున్నారు. డ్రైవరు రహిత రైలే అయినా పొరబాట్లు, తప్పిదాలు లేకుండానే సేవలందుతాయి. కంట్రోల్ సెంటర్‌లో ఆపరేటర్లు రైళ్లు ఎలా నడుస్తున్నాయో నిశితంగా గమనిస్తుంటారు. ఎక్కడైనా లోపాలు తలెత్తి సరిగ్గా పనిచేయకుంటే ఆపరేటర్లు కంట్రోల్ రూం నుంచి సరిచేస్తారు. కంట్రోల్ రూంలోని ఆపరేటర్లు మెట్రోస్ ఇంటర్‌కం సిస్టమ్స్ ద్వారా ప్రయాణికులతో అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతుంటారు. అలా మాట్లాడుకోవడానికి వీలుగా రైళ్లు, నేల మీద ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌లో సెన్సార్లు ఉంటాయి. అందుకు తగిన విధంగా డ్రైవరు రహిత రైలును డిజైన్ చేశారు.

■ సిడ్నీ లాంటి దేశాల్లో మెట్రో డ్రైవరు రహిత రైళ్లు ఎలా నడుస్తున్నాయో ఆల్‌స్టోమ్ సంస్థ అధికారులు తెలిపారు. ట్రాక్‌పై డిజిటల్‌తో అనుసంధానమై ఇంటర్ లాకింగ్ విధానంతో కూడి ఉంటుందన్నారు. మెట్రో రైళ్లు వెళ్లడానికి దారి ఇవ్వాలని కంట్రోల్ సెంటరు అడిగితే, ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ పరిశీలించి ఇంకో రైలు వెళ్లడానికి అనుమతిస్తుంది.

ఇంటెలిజెంట్ సిస్టమ్

ఇంటెలిజెంట్ సిస్టమ్ పూర్తి స్థాయిలో సేవల్లోకి అందుబాటులోకి వచ్చిన తర్వాత మొత్తం డ్రైవరు రహిత మెట్రో రైలుకు నెట్‌వర్క్‌కు వ్యాప్తి చెందుతుందని ఆల్‌స్టోమ్ సంస్థ పేర్కొంది. వేగాన్ని తగ్గించేందుకు, పెంచేందుకు, స్టేషన్లలో ఆగడానికి, ఆయా స్టేషన్లలో సరిగ్గా తలుపులు తెరుచుకునేందుకు, మూయడానికి సెన్సార్లు, బెకాన్లు, ఇంటెలిజెంట్ ఆబ్జెక్టులు కీలకపాత్ర పోషిస్తాయని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

డీఎంకే కూటమి త్వరలో విచ్ఛిన్నం: ఎంఆర్ విజయబాస్కర్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: డీఎంకే కూటమి త్వరలో విచ్ఛిన్నం కానుందని, 2026 అసెంబ్లీ ఎన్నికలలో అన్నాడీఎంకే అధికారంలోకి వస్తుందని ఎంఆర్ విజయబాస్కర్ జోస్యం చెప్పారు. కరూర్ జిల్లా కృష్ణరాయపురం నియోజకవర్గం పరిధిలోని తాంథోని ఈస్ట్, వెస్ట్ యూనియన్‌కు చెందిన పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం చెల్లాండిపట్టిలోని ఓ ప్రైవేట్ ప్యాలెస్‌లో జరిగింది. నిర్వహక కార్యదర్శి, మాజీమంత్రి ఎం చిన్నసామి, జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి ఎంఆర్ విజయబాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. అన్నాడీఎంకే నేతలను బెదిరించి డీఎంకేలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. పార్టీలో 2 కోట్ల మంది సభ్యులు చేరారని చెప్పారు. ఎన్నికల పనులు ప్రారంభించి సభ్యత్వ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలకు 'డీవోటీఈ' హెచ్చరికలు

వడపళని: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, 7.5 శాతం కోటా కింద ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరే వారినుంచి నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేసే కళాశాలలు గుర్తింపు కోల్పోవాల్సి వస్తుందని ఉన్నత విద్యాశాఖ హెచ్చరించింది. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ విభాగం లబ్ధిదారులను గుర్తించే పనుల్లో నిమగ్నమై ఉంది. కొన్ని కళాశాలలు ఫీజులు అడుగుతున్నట్టు శాఖ దృష్టికి వచ్చింది. 2021లోని చట్టం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 7.5 శాతం కోటాలో 'ప్రెఫరెన్షియల్ బేసిస్ టు స్టూడెంట్స్' (పీబీఎస్) కింద ఇంజినీరింగ్ యూజీ కోర్సుల్లో చేరే వారికి ట్యూషన్ ఫీజు, హాస్టలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. దీనిపై 'డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (డీవోటీఈ) సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ... ప్రభుత్వ కోటా కింద చేరిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలలు నగదు అడుగుతున్నట్టు తమకు ఫిర్యాదులందుతున్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరం, మొదటి సంవత్సరంలో చేరబోతున్న విద్యార్థుల గురించి అధికారి వివరించారు. ఈ ఏడాది ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చులు మొదటి సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం వరకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. 2022-23లో మొదటి ఏడాది 8,719, రెండో సంవత్సరం 6,278 మంది విద్యార్థులకు రూ.129.08 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2023-24లో మొదటి సంవత్సరం 9,795, రెండో సంవత్సరం 6,162, మూడో సంవత్సరం 6,162 మందికి రూ.185.59 కోట్లు అందజేశామన్నారు. ఈ విద్యా సంవత్సరానికి రూ.200 కోట్ల మేరకు నిధుల అవసరముంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అందే లబ్ధికోసం విద్యార్థులు మార్కుల పత్రాలు, బోనఫైడ్ పత్రాలు, కళాశాల ట్యూషన్ ఫీజు, హాస్టలు, రవాణా ఫీజు వివరాలు ఆన్‌లైన్‌లో తెలపాలన్నారు. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాతనే నిధుల విడుదల జరుగుతుందని, అప్పటివరకు డబ్బు కట్టాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు కళాశాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడి తీసుకురాకూడదని అధికారి స్పష్టం చేశారు.



సురుళి జలపాత సందర్శనకు నిషేధం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తేని జిల్లా కంబం సమీపంలో పశ్చిమ కనుమల్లో ఉన్న సురుళి జలపాతానికి శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులు వచ్చి స్నానమాచరించి వెళ్తుంటారు. అదేవిధంగా అమావాస్య రోజుల్లో ప్రజలు ఇక్కడ తమ పితృదేవతలకు తర్పణాలు వదులుతుంటారు. ఈ క్రమంలో తూవానం, మేఘమలై తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జలపాతంలో వరద ప్రవాహం ఎక్కువైంది. దీంతో అనుమతి లేకుండా జలపాతం వద్దకు పర్యాటకులు రాకూడదని, స్నానమాచరించకూడదని అటవీశాఖ అధికారులు నిషేధం విధించారు. విషయం తెలియని అనేక మంది పర్యాటకులు ఆదివారం జలపాలతం వద్దకు వచ్చి వెనుదిరిగారు.



టీవీకే మహానాడుకు తాటిచెట్ల నరికివేత

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండి సమీపంలో ఈనెల 27వ తేదీ తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. 60 అడుగుల వెడల్పు, 170 అడుగుల పొడవుతో సభా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. ప్రాంగణంలో ముళ్ల పొదలను తొలగించి చదును చేస్తున్నారు. 992 విద్యుత్తు దీపాల స్తంభాలు, 85 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 937 పార్టీ జెండాలను నాటే పనులు జరుగుతున్నాయి. అంతేకాకుండా పాల్గొనేవారికి 300కు పైగా సంచార మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాంగణంలో ఉన్న 8 తాటిచెట్లను జిల్లా యంత్రాంగం అనుమతి లేకుండా టీవీకే నిర్వాహకులు తొలగించడం చర్చనీయాంశమైంది.

కళాశాలల్లో 4వేల అధ్యాపకుల పోస్టుల భర్తీ

• మంత్రి కోవి.చెళియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్ల శాశ్వత ప్రాతిపదికన 4వేల అధ్యాపకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ తెలిపారు. కుంభకోణం ప్రభుత్వ బాలుర కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి కోవి.చెళియన్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భారతిదాసన్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి మారిన ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ గౌరవ ఆచార్యులు, అధికారులకు వేతన బకాయిలు చెల్లించేందుకు ఆర్థిక, ఉన్నత విద్యాశాఖ అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. త్వరలో సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఉన్నందున గౌరవ ఆచార్యులను నియమించినట్లు తెలిపారు. ఇంకా 4వేలకుపైగా పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రద్దీ సమయాల్లో మెట్రోలో జాగ్రత్తలపై ప్రణాళిక

రూపకల్పనకు సీఎంఆర్ఎల్ కసరత్తు

- న్యూస్‌టుడే, వడపళని

ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి రద్దీగా ఉండే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) సరికొత్త తరహాలో ప్రణాళికలు రచిస్తోంది. నగరంలో తరచూ పలు రకాల ప్రత్యేక కార్యక్రమాలు, క్రీడా పోటీలు జరుగుతుంటాయి. అలాంటి సందర్భాలలో సీఎంఆర్ఎల్ ఆయా ప్రాంతాలకు తగినట్టుగా ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. అప్పుడు రద్దీ కూడా పెరుగుతోంది.

■ ఎయిర్ షోకు తాకిడి

మెరీనా తీరంలో 6వ తేదీ జరిగిన భారత వైమానిక దళ 'ఎయిర్ షో'కు వెళ్లడానికి మెట్రో సేవలకు డిమాండు పెరిగింది. పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది విన్యాసాలు వీక్షించేందుకు తరలివచ్చారు. ఒక్క మెట్రో రైళ్లలోనే నాలుగు లక్షల మంది ప్రయాణాలు చేయడం గమనార్హం. విన్యాసాలకు దగ్గరగా ఉన్న గవర్నమెంట్ ఎస్టేట్ స్టేషన్' నుంచి వేలాది మంది రాకపోకలు సాగించారు.



గవర్నమెంట్ ఎస్టేట్ మెట్రో స్టేషను

■ నియంత్రణకు చర్యలు

ఎయిర్ షోకు వచ్చిన ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందు మెట్రో స్టేషన్లకు సమీపంలో జరిగే కార్యక్రమాలకు రద్దీని ఎలా క్రమబద్ధీకరించాలనే దానిపై సీఎంఆర్ఎల్ ప్రణాళికలు రూపొందిస్తోంది. నందనంలోని వైఎంసీఏ, చేపాక్ స్టేడియం, మెరీనా బీచ్ వంటి ప్రాంతాలకు జనం బాగా తరలివస్తున్నారు. ఇక్కడికి వచ్చేవారు గవర్నమెంట్ ఎస్టేట్, నందనం, ఎల్ఐసీ, చెన్నై సెంట్రల్ స్టేషన్లకు అధిక సంఖ్యలో చేరుకుంటున్నారు. ఈ స్టేషన్లలో రద్దీని నియంత్రించేందుకు రైళ్ల వ్యవధి పెంచడం, ఇతరత్రా వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్టు సీఎంఆర్ఎల్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

■ స్థాయి పెంచేందుకు నిర్ణయం

పైన తెలిపిన స్టేషన్లలో కొన్నింటిలో పార్కింగు స్థలం స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని, పార్కింగు ప్రవేశద్వారం నుంచి మార్పులు చేసి, పైన కప్పు అమర్చాలనుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రయాణికులు బయలుదేరే స్టేషను, దిగే స్టేషనులో వారి టిక్కెట్టును స్వైప్ చేస్తుంటారు. అలా కాకుండా ఒక స్టేషనులో చేస్తే సరిపోయే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. తాము చేపట్టాలనుకుంటున్న పనులన్నీ పూర్తయి కొత్త పద్ధతులను అమల్లోకి తీసుకురావడానికి 5 నుంచి 6 నెలల సమయం పట్టొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు సిద్ధం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సాత్తూర్ రామచంద్రన్ తెలిపారు. విరుదునగర్ జిల్లా అరుప్పుకోట్టైలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.154.98 కోట్ల వ్యయంతో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అరుప్పుకోట్టైలో రోడ్లన్నీ చిన్నవిగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించేలా ప్రస్తుతం బైపాస్ రోడ్డుని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లను ముఖ్యమంత్రి చేపట్టారన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టరు జయశీలన్, హైవేశాఖ ప్రాజెక్టుల తిరునెల్వేలి డివిజన్ ఇంజినీర్ లింగుసామి తదితరులు ఉన్నారు.



రోడ్డు నిర్మాణ వివరాలు పరిశీలిస్తున్న మంత్రి రామచంద్రన్



మాట్లాడుతున్న మంత్రి అన్బిల్ మహేశ్

సీమాన్ వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయి

▸ మంత్రి అన్బిల్ మహేశ్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సీమాన్ వ్యాఖ్యలు తనను ఆవేదనకు గురిచేశాయని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ సంయుక్తంగా 'డ్రీమ్ టీచర్' అవార్డుకుగాను పరీక్ష నిర్వహించాయి. రాష్ట్రవ్యాప్తంగా 8,096 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మూడు దశలుగా జరిగిన పరీక్షలో 380మంది చివరిగా ఎంపికయ్యారు. వీరిలో ఉత్తమ మార్కులు సాధించిన 54మంది ఉపాధ్యాయులను ఫ్రాన్స్ దేశ పర్యటనకు 23వ తేదీ తీసుకెళ్తున్నారు. వారిని సాగనంపే కార్యక్రమం తిరుచ్చిలో ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న మంత్రి అన్బిల్ మహేశ్ పాల్గొని ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక, మాధ్యమిక, మహోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అధికారులు సహా 60మంది విద్యా పర్యటనకుగాను ఫ్రాన్స్‌కు వెళ్తున్నారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే 'తమిళ్‌త్తాయ్ వాల్తు' గీతాన్ని తొలగిస్తామని సీమాన్ మాట్లాడడం ఆవేదనకు గురిచేసిందన్నారు. రాష్ట్రంలో రాజకీయం విద్యతోనే ప్రారంభమవుతుందన్నారు. అభినందించడానికైనా, విమర్శించడానికైనా తమిళ భాషలో మాట్లాడే ఆయన ఇలా మాట్లాడటం బాధాకరమన్నారు.

మూడు రోజుల్లో 2,616 మిలియన్ లీటర్ల నీరు శుద్ధీకరణ

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో వాటర్ విభాగం మూడు రోజుల్లో 2,616.28 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి సరఫరా చేసింది. 16, 17, 18 తేదీల్లో 356 మురుగునీటి పంపింగు స్టేషన్లు, 22 వ్యర్థ నీటి ప్లాంటుల నుంచి శుద్ధి చేసినట్టు తెలిపింది. 16వ తేదీ 936.56, 17న 841.02, 18న 838.52 మిల్లియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసినట్లు వివరించింది. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 15 జోన్లలో వాననీటి తొలగింపు, మురుగును తొలగించడంలో బోర్డు చురుకుగా పని చేస్తోందని తెలిపింది. ప్రధాన పైపులైన్లలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు 299 వ్యాక్యూమ్ ట్రక్కులు, 73 ర్యాపిడ్ సెక్షన్ వాహనాలు, 225 జెట్టింగ్ వాహనాలతో పాటు ఇతర రకాలైన మొత్తం 687 వాహనాలు 24 గంటలపాటు రంగంలోకి దిగి పని చేశాయని, 683 వీధుల్లో 24,436 మీటర్ల మేర మురుగు లైన్లు శుద్ధి చేశారని, 1,886 మంది క్షేత్రస్థాయి సిబ్బంది 16 నుంచి 18వ తేదీ వరకు అత్యవసర సేవల నిమిత్తం నిరవధికంగా విధుల్లో ఉన్నారని వెల్లడించింది.



శరణాలయంలో పక్షులు

కొడియకరై చేరుకుంటున్న విదేశీ పక్షులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్నం జిల్లా వేదారణ్యం సమీపంలోని కొడియకరై పక్షుల శరణాలయానికి విదేశాల నుంచి వైట్ స్టోర్క్, పిలికాన్, ఫ్లెమింగో, క్రెన్ తదితర పక్షుల రాక ప్రారంభమైంది. అక్టోబర్ నుంచి మార్చి వరకు రష్యా, ఇరాక్, శ్రీలంక తదితర దేశాల నుంచి అక్కడి ప్రతికూల వాతావరణం కారణంగా 290కు పైగా రకాల పక్షులు ఏటా ఇక్కడికి వచ్చి వెళ్తుంటాయి.

అన్నాడీఎంకే జెండా ఎగురవేయలేని పరిస్థితి

☛ మాజీ మంత్రి సెల్లూర్ రాజు

ప్యారిస్, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వ అధికార దుష్ప్రయోగం వల్ల రాష్ట్రంలో అన్నాడీఎంకే జెండాను ఎగురవేయలేని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి సెల్లూర్ రాజు ఆరోపించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి 30వ తేదీ రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో జరగనున్న దేవర్ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. ఇందుకుగాను 29న సాయంత్రం మదురై రానున్న ఎడప్పాడికి మదురై జిల్లా అన్నాడీఎంకే తరఫున ఘనంగా స్వాగతం పలుకనున్నారు. ఇందుకు సంబంధించిన సమావేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి సెల్లూర్ రాజు నేతృత్వంలో జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక డీఎంకే పాలనలో అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కానీ డీఎంకే అధికార దుష్ప్రయోగం వల్ల పార్టీ జెండాను ఎగురవేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనకు 2026 శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ముగింపు పలుకుతారని పేర్కొన్నారు.

ఘనంగా కోదండరామాలయ ముఖమండప ప్రారంభోత్సవం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని కొరట్టూర్ అగ్రహారంలో శ్రీ ఆంధ్ర కళాస్రవంతి నిర్వహణలోని శ్రీకోదండరామాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముఖమండప ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రముఖ ఆర్కిటెక్ట్, ఆస్కా మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్య మండపాన్ని ప్రారంభించారు. అనంతరం సీతారామ కల్యాణం జరిపారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ బీఎన్ గుప్తా కుటుంబం తరఫున ముఖమండపాన్ని నిర్మించినట్టు స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎన్ గుప్తా, సరోజాదేవి దంపతులను నిర్వాహకులు జ్ఞాపికలతో సన్మానించారు. శ్రీ ఆంధ్ర కళాస్రవంతి సలహాదారుడు ఎంఎస్ మూర్తి, అధ్యక్షుడు జేఎం నాయుడు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బీఎన్ గుప్తాకు జ్ఞాపిక అందజేస్తున్న ఏకేఏస్ నిర్వాహకులు

చెన్నైలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్యారిస్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు చెన్నైలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. శాంథోం హైవే నుంచి గాంధీ విగ్రహానికి వచ్చే వాహనాలు కారనీశ్వరర్ కోవిల్ వీధి జంక్షన్‌లో ఎడమవైపుకు మళ్లి కారనీశ్వరర్ పగోడ వీధి, అంబేడ్కర్ బ్రిడ్జి, నటేశన్ జంక్షన్ వైపుగా వెళ్లాలి. ఎదురువైపుగా వాహనాలకు అనుమతి లేదు. • ఎంఆర్టీసీ-ఆర్కేసాలై జంక్షన్ దాటి గాంధీ విగ్రహానికి వచ్చేందుకు వాహనాలకు అనుమతి లేదు. ప్రత్యామ్నాయంగా లైట్‌హౌస్ ఎంఆర్టీసీ సాలై వైపుగా వెళ్లి లాయిడ్స్ సాలై, కామరాజర్‌సాలై వైపుగా వెళ్లవచ్చు. • మైలాపూర్ నుంచి ప్యారిస్ వెళ్లే ఎంటీసీ బస్సు 21జీ, రాయపేట-1 పాయింట్, మ్యూజిక్ అకాడమీ పాయింట్, టీటీకే రోడ్డు, ఇండియన్ బ్యాంకు జేఎన్, రాయపేట హైవే, జీఆర్‌హెచ్ పాయింట్, అన్నాసాలై వెళ్లి అక్కడి నుంచి వెళ్లవచ్చు. • కేథడ్రల్ రోడ్డు లైట్‌హౌస్ వెళ్లే ఎంటీసీ బస్సు 27డీ వీఎమ్ స్ట్రీట్ వద్ద మలుపుతిరిగి లస్ జంక్షన్, లస్ చర్చ్‌సాలై, డి స్లివా సాలై, భక్తవత్సలసాలై, డాక్టర్ రంగాసాలై, బీమనా గార్డెన్ జేఎన్ సీపీ రామసామి సాలై, శీనివాసన్ వీధి, ఆర్కే మఠం సాలై వైపుగా వెళ్లి తమ గమ్యాన్ని చేరుకోవచ్చు. కామరాజర్ సాలై (నేప్పియార్ బ్రిడ్జి నుంచి లైట్‌హౌస్) వరకు అన్ని వర్తక, భారీ వాహనాలు వెళ్లేందుకు నిషేధం విధించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ సుధీర్‌కుమార్

రైళ్ల దారి మళ్లింపు

వడపళని, న్యూస్‌టుడే: రంగియా డివిజన్‌లోని నల్‌బరి - భైహట సెక్షనులో జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా ఈ కింది రైళ్లను దారి మళ్లించినట్టు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

● **15929** తాంబరం - న్యూ టిన్‌సుకియా ఎక్స్‌ప్రెస్ 24న 18.35కు బయలుదేరే రైలు గోల్‌పారా టౌన్, గువాహటి, లుండింగ్, ఫర్కేటింగ్, మొరాహట్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది. ● **15930** న్యూ టిన్‌సుకియా - తాంబరం 28న 06.30 రైలు మొరాహట్, ఫర్కేటింగ్, లుండింగ్, గువాహటి, గోల్‌పారా టౌన్ మార్గంగా దారి మళ్లించారు. ● **05952** న్యూటిన్ సుకియా - ఎస్ఎంవీటీ బెంగళూరు 20న 18.45కు బయలుదేరి పెరంబూరు, కాట్పాడి, జోలార్‌పేట్టై మీదుగా వచ్చే రైలు మొరాహట్, ఫర్కేటింగ్, లుండింగ్, గువాహటి, గోల్‌పారా టౌన్ మీదుగా వస్తుంది.



చిన్నారులతో నిర్వాహకులు

ఘనంగా కన్య పూజ

వడపళని, న్యూస్‌టుడే: దీపావళి పండుగను పురస్కరించుకుని 'లయన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఫోర్ట్ సెయింట్ జార్జి' అనుబంధ సంస్థ 'ఫోర్ట్ లయన్స్ ఛారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో శనివారం చేట్‌పేట్‌లో కన్య పూజ నిర్వహించారు. తొమ్మిది మంది చిన్నారులకు క్లబ్ అధ్యక్షురాలు మనిష్ వోరా ఆధ్వర్యంలో పూజ చేశారు. క్లబ్ రెండో వైస్ గవర్నర్ లయన్ రాజేష్ ఎం.జోషి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలకు దుస్తులు అందజేశారు. సభ్యులను జ్ఞాపికలతో మనిష్ వోరా సత్కరించారు.

ఏడాదిలో 295 కిలోల గంజాయి స్వాధీనం

ఈరోడ్ ఎస్పీ జవహర్




విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లాలో ఈ ఏడాది 295 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని గూండా చట్టం కింద ఐదుగురిపై చర్యలు తీసుకున్నట్టు ఈరోడ్ ఎస్పీ జవహర్ తెలిపారు. మత్తు ఇంజక్షన్ విక్రయించిన వ్యవహారంలో ఇందుమతి, సమీమ్‌భాను, సంధ్య సహా 9 మందిని ఈరోడ్ వీరప్పన్‌ఛత్రం పోలీసులు అరెస్టు చేసి మత్తు ఇంజక్షన్, మాత్రలను స్వాధీనం చేసుకున్నాను. వీరిపై ఇప్పటికే మత్తు ఇంజక్షన్ల విక్రయం తదితర పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జవహర్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా పోలీసు యంత్రాంగం మాదక ద్రవ్యాల నిర్మూలనకు పలు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నేరాలకు పాల్పడిన వారి రూ.1.02 కోట్ల మేర ఆస్తులు స్తంభింపజేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు 11,271 నొప్పి నివారణ మాత్రలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. మాదకద్రవ్యాలు విక్రయించిన వారిపై వచ్చిన ఫిర్యాదులు గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి ఈ ఏడాది 208 కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. కొరియర్ కార్యాలయాలకు అనుమానాస్పద పార్శిల్స్ వస్తే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మత్తుపదార్థాల నివారణపై పోలీసుల ద్వారా ఫోరం ప్రారంభించి ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

సహకార ఉద్యోగులకు 20శాతం బోనస్ అందజేయాలి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సహకార సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి 20శాతం బోనస్ అందజేయాలని తొళిలాళర్ మున్నేట్ర సంఘం (తొముస) నిర్వాహకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సహకార టోకు విక్రయ దుకాణాల తొముస రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చై, ప్రధాన కార్యదర్శి పద్మనాభన్, కోశాధికారి ఇరా పళనియప్పన్, టీయూసీఎస్ తొముస ప్రధాన కార్యదర్శి రాజన్ సామినాథన్ తదితరులు చెన్నై సచివాలయంలో సహకార, ఆహారశాఖ కార్యదర్శి రాధాకృష్ణన్, రిజిస్ట్రార్ సుబ్బయ్యన్‌ని శనివారం కలిసి వినతి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార సంస్థలకు బకాయి ఉన్న రూ.750 కోట్లు విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి పక్షపాతం చూపకుండా సిబ్బందికి 20 శాతం బోనస్ అందజేయాలని, 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న 5 వేల మందికిపైగా ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

10 లక్షల తాటి విత్తనాలు నాటేందుకు లక్ష్యం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లాలో 10 లక్షల తాటి విత్తనాలు నాటడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. చిదంబరం సమీప గుడువెళ్లచావడి పంచాయతీలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని కలెక్టరు ఆదిత్య సెంథిల్ కుమార్ అధ్యక్షతన ఆదివారం ఆయన ప్రారంభించారు. తరువాత వల్లంగాడు పంచాయతీలో తాటి విత్తనాలు నాటే కార్యక్రమాలను ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. చిదంబరం, కాట్టుమన్నార్ కోవిల్ ప్రాంతాల్లో తాటి విత్తనాలు నాటే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కడలూర్ జిల్లాలో 10 లక్షల తాటి విత్తనాలు నాటడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాటడానికి ముఖ్యమంత్రి బడ్జెట్టులో నిధులు కేటాయించడంతో నాటే కార్యక్రమాలు ప్రతి గ్రామంలో జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టరు సౌమ్య, చిదంబరం సబ్ కలెక్టరు రష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం


న్యాయవాదులు చట్టాలపై పట్టు సాధించాలి



సదస్సును ప్రారంభిస్తున్న న్యాయమూర్తి ఎళిలరసి

మహాబలిపురం, న్యూస్‌టుడే: న్యాయవాదులు ప్రస్తుత చట్టాల్లో జరుగుతున్న మార్పుల గురించి తెలుసుకోవాలని చెంగల్పట్టు మహిళా కోర్టు న్యాయమూర్తి ఎళిలరసి పేర్కొన్నారు. చెంగల్పట్టులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో ప్రిన్సిపల్ తంగమణి నేతృత్వంలో తృతీయ, ఐదో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఒక రోజు సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎళిలరసి సదస్సు ప్రారంభించి ప్రసంగించారు. మారుతున్న కాలానికి, సాంకేతిక మార్పులకు తగ్గట్లు చట్టాల్లో మార్పులు వచ్చాయని, వాటి గురించి న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో న్యాయమూర్తి తమిళ్‌సెల్వి, మాజీ డీజీపీ జాంకిడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీఎన్‌టీజే మతసామరస్య సమావేశం



మాట్లాడుతున్న మహమ్మద్

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళనాడు తౌహీద్ జమాత్ కాంచీపురం జిల్లా కాంచీపురం శాఖ తరపున ఆదివారం కాంచీపురం సమీప వలీమహమ్మద్‌పేటలో ఉన్న మసీదులో 'ఇస్లాం ఒక మంచి మార్గం' అనే అంశంపై మతసామరస్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో అన్ని మతాలవారు పాల్గొన్నారు. టీఎన్‌టీజే కమిటీ సభ్యుడు ఇ.మహమ్మద్ ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. జిల్లా డిప్యూటీ కార్యదర్శి సర్బుద్దీన్, వైద్య విభాగం, విద్యార్థి విభాగాల కాంచీపురం శాఖ కార్యదర్శి యూసూఫ్, కోశాధికారి ఫాసిల్, డిప్యూటీ కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



వేణు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి నాజర్ తదితరులు

మాజీ ఎమ్మెల్యే కె.వేణుకు నివాళి

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి మాజీ ఎమ్మెల్యే, కలైజ్ఞర్ పురస్కార గ్రహీత, డీఎంకే సీనియర్ నేత కె.వేణు 2023 నవంబరు 20న మరణించారు. ఆయన తొలి వర్ధంతి ఆదివారం నిర్వహించారు. గుమ్మిడిపూండి సమీప పనపాక్కంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి నాజర్, ఎమ్మెల్యే గోవిందరాజన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా వరదనారాయణుని ఊరేగింపు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు బ్రాహ్మణ వీధిలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత వరద నారాయణ పెరుమాళ్ ఆలయంలో పెరటాసి మాస శనివారాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి వివిధ రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో పట్టణ వీధుల్లో ఊరేగించారు.



శ్రీదేవి, భూదేవి సమేత వరదనారాయణుడు

తిరుచ్చెందూర్ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో భక్తులు


ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ తిరుచ్చెందూర్ సుబ్రహ్మణ్యస్వామిని ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. ఆదివారం, పండుగ రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఐప్పసి మాసం స్కందషష్టి వేడుకలు జరగనున్న క్రమంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. అంతేకాకుండా ఆదివారం సెలవు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. 6 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం జరిగింది.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా పొదట్టూరుపేట ఉచ్చిష్టైయార్ ఆలయంలో 150వ సంకటహర చతుర్థి ఉత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న వినాయకస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



అలంకరణలో స్వామివారు




రజనీకాంత్‌కు వెంకట్‌ప్రభు కృతజ్ఞతలు

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (ది గోట్) సెప్టెంబరు 5న సినిమా థియేటర్లలో విడుదలై ఇప్పటివరకు రూ.455 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈనెల 3న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫారంలో విడుదలైంది. సినిమా విజయవంతమైన నేపథ్యంలో దర్శకుడు వెంకట్ ప్రభుని సూపర్‌స్టార్ రజనీకాంత్ ఫోన్ ద్వారా సంప్రదించి అభినందించారు. దీనికి వెంకట్ ప్రభు హర్షం వ్యక్తం చేస్తూ తన 'ఎక్స్' పేజీలో... ఫోన్ చేసి 'గోట్' చిత్రాన్ని ప్రేమపూర్వకంగా అభినందించినందుకు కృతజ్ఞతలు 'తలైవా'. హృదయపూర్వకంగా అభినందించినందుకు మరోసారి కృతజ్ఞతలు' అని తెలిపారు.

సొర్గవాసల్ ఫస్ట్‌లుక్ విడుదల

చెన్నై: పా.రంజిత్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన సిద్ధార్థ్ విశ్వనాథ్ దర్శకత్వంలో ఆర్జే బాలాజీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రానికి 'సొర్గవాసల్' టైటిల్ ఖరారు చేశారు. స్వీప్ రైడ్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రానికి కథను దర్శకుడు సిద్ధార్థ్ విశ్వనాథ్‌తో పాటు తమిళ్ ప్రభ, అశ్విన్ రవిచంద్రన్ సంయుక్తంగా రాశారు. చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టరును దర్శకుడు పా.రంజిత్ విడుదల చేశారు.




లియోకు ఏడాది పూర్తి



లోకేశ్ కనకరాజ్ పంచుకున్న చిత్రం

చెన్నై: లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో విజయ్ నటించి గత ఏడాది అక్టోబరు 19న విడుదలైన చిత్రం 'లియో'. చిత్రం విడుదలై ఏడాది ముగిసిన సందర్భంగా దర్శకుడు లోకేశ్ కనకరాజ్ తన 'ఎక్స్' పేజీలో ఓ పోస్టు చేశారు. అందులో... ఎన్నో పాఠాలు, ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో ఉత్తేజకరమైన క్షణాలు నా హృదయంలో ఎప్పటికీ నిలిచిపోయే సినిమా 'లియో'. చిత్రం కోసం చెమట, రక్తం చిందించిన అందరికీ, ప్రేక్షకులకు కృతజ్ఞతలని తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌తో కలిసి ఉన్న చిత్రాన్ని పంచుకున్నారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నెల్సన్



అంచనాలను పటాపంచలు చేసిన కవిన్
దర్శకుడు నెల్సన్

చెన్నై: దర్శకుడు నెల్సన్ నిర్మాణంలో కవిన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బ్లడీ బెగ్గర్'. చిత్రానికి జెన్ మార్టిన్ సంగీతం సమకూర్చారు. చిత్రంలో రెడిన్ కింగ్స్లి, మారుతి ప్రకాశ్‌రాజ్, అక్షయ హరిహరన్ తదితరులు ఇతర నటీనటులు. వర్ధమాన దర్శకుడు శివబాలన్ ముత్తుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రానున్న 31న దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని చిత్రబృందం నిర్వహించింది. ఇందులో... దర్శకుడు నెల్సన్ మాట్లాడుతూ... చిత్రంలో కథానాయకుడిగా కవిన్ కావాలంటూ దర్శకుడు శివబాలన్ ముత్తుకుమార్ తనతో చెప్పగా మొదట నిరాకరించానని తెలిపారు. చిత్రంలోని పాత్రకు ఆయన సరిపోరని భావించానని, ఆ పాత్రకు తన మనసులో ధనుష్, విజయ్ సేతుపతి ఉన్నారని పేర్కొన్నారు. పట్టుపట్టి కవిన్‌ను దర్శకుడు తీసుకున్నారని తెలిపారు. చిత్రీకరణ పనులు ముగిసిన తర్వాత చిత్రాన్ని చూసి ఆశ్చర్యపోయానని, అద్భుతమైన నటనను కవిన్ కనబరిచారని, తన అంచనాలను పటాపంచలు చేశారని పేర్కొన్నారు.





వేళచ్చేరి: సమీక్ష నిర్వహిస్తున్న ఉదయనిధి స్టాలిన్ ▸ తిరువణ్ణామలై: బస్టాండ్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులపై సమీక్ష

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పథకాల పురోగతిపై కళ్లకురిచ్చి కలెక్టరు కార్యాలయంలో శనివారం రాత్రి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్.రాజేంద్రన్, కలెక్టరు ఎం.ఎస్ ప్రశాంత్, ఎంపీలు మలైయరసన్ (కళ్లకురిచ్చి), రవికుమార్ (విళుపురం), ఎమ్మెల్యేలు ఉదయ సూర్యన్ (శంకరాపురం), వసంతం కార్తికేయన్ (రిషివందియం), ఏ.జె మణికన్నన్ (ఉళుందూర్‌పేట), జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు భువనేశ్వరి పెరుమాళ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్టాండు పునరుద్ధరణ పనుల పరిశీలన

తిరువణ్ణామలై: తిరువణ్ణామలైలో జరుగుతున్న బస్టాండు రోడ్డు పనులు, పలు అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ శనివారం పరిశీలించారు. తర్వాత జిల్లా కలెక్టరు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఏవీ వేలు, ఉప సభాపతి కె.పిచ్చాండి, ఎంపీలు సీఎన్ అన్నాదురై, ఎస్.ధరణివేందన్, ఎమ్మెల్యేలు గిరి, అంబేత్‌కుమార్, జ్యోతి, శరవణన్, జిల్లా కలెక్టరు భాస్కరపాండియన్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నిండిన 59 కొలనులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నైలో 2015 ఏడాది వరదలు సంభవించడంతో జలవనరుల్లో నీటిమట్టం ఓ స్థాయికి పెరిగింది. ఆ తర్వాత వరుసగా మూడేళ్లు తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో మహానగరపాలక సంస్థ జలవనరుల పునరుద్ధరణపై దృష్టి సారించింది. ప్రస్తుతం అవి పునరుత్తేజం సంతరించుకున్నాయి. ఈ క్రమంలో 186 చెరువులు, కొలనులు, 15 ఆలయ కొలనులను పునరుద్ధరించి నీటి సేకరణకు మార్గం సుగమం చేశారు. వర్షపునీటి కాలువల సమీపంలో ఫిల్టర్ గుంతలతో అనుసంధానించి 5,846 వర్షపునీటి సేకరణ సదుపాయాలను కల్పించారు. భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి శ్రద్ధ చూపుతున్న కార్పొరేషన్ చెన్నైలోని 54 ప్రాంతాలలో స్పాంజ్ పార్కులను నిర్మిస్తోంది. తద్వారా వర్షాకాలంలో నీటిని నిల్వచేసి భూగర్భ జలమట్టాన్ని పెంచనుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం 59 కొలనులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలలో ఏడాది వరకు భూగర్భ జలమట్టం తగ్గే ప్రసక్తే లేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





▸ అడయార్ జోన్‌లోని మరుదీశ్వరర్ ఆలయ కొలను ▸ అన్నానగర్ జోన్ పరిధిలోని పరశురామర్ ఆలయ కొలను

వేగంగా చోళవరం చెరువు పునరుద్ధరణ



చోళవరం చెరువు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చోళవరం చెరువు తీరంలో పూడికతీత పనులు జరిపి పునరుద్ధరించే పనులు శరవేగంగా జరుగుతున్నట్టు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. చెన్నై ప్రజల దాహార్తిని తీరుస్తున్న చోళవరం చెరువు పూర్తి సామర్థ్యం 1,081 ఘనపుటడుగులు. శనివారం పరిస్థితి ప్రకారం సెకనుకు 200 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. కాలువ ద్వారా పుళల్ చెరువుకు సెకనుకు 80 ఘనపుటడుగుల నీటిని విడుదల చేశారు. గతేడాది మిగ్‌జామ్ తుపాను సమయంలో చోళవరం చెరువు తీరం సుమారు కిలోమీటరు దూరం దెబ్బతింది. ఆ ప్రాంతంలో పూడికతీత పనులు జరిపి పునరుద్ధరించే పనులు జరుపుతున్నారు. తీరం లోపల 6 మీటర్ల ఎత్తు సిమెంట్ కాంక్రీట్ ఏర్పాటు చేసి తీరంలో బండరాళ్లను అమరుస్తున్నారు. చెరువు సమీపంలోని దేవనేరి ప్రాంతంలో రెండు కొత్త షట్టర్లు ఏర్పాటు చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఆక్రమణల తొలగింపు



ఆందోళన నిర్వహిస్తున్న ఆక్రమణదారులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పూందమల్లి సమీప తిరువేర్కాడు చెరువును ఆక్రమించుకుని చాలామంది గృహాలు నిర్మించుకున్నారు. వీటిని స్వతహాగా తొలగించాలని రెవెన్యూశాఖ అధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. అయినా తొలగించకపోవడంతో సదరుశాఖాధికారులు ఆదివారం తొలగించారు. దీనికి నిరసనగా ఆక్రమణలదారులు ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం
భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల, న్యూస్‌టుడే: తమిళనాడుకు చెందిన కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొన్న ఘటన తిరుమల ఘాట్‌రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు భక్తులు కారులో తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం కారులో మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా తిరుపతికి బయలుదేరారు. వాహనం 15వ మలుపు వద్దకు చేరుకుంటుండగా అదుపుతప్పి రహదారి పక్కన రక్షణ గోడను ఢీకొంది. ప్రమాదంలో కారులోని భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కారును పక్కకు తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.



రక్షణ గోడను ఢీకొన్న కారు



గాయపడిన భక్తులు



పెద్ద కాంచీపురం సెంగుళ నీరోడై వీధిలోని పురాతన హజరత్ ఖాజా సయ్యద్ షాజ్ హమీదుద్దీన్ అవులియా పాదుషా దర్గాలో శనివారం రాత్రి చాదర్ సమర్పించి ప్రార్థనలు చేస్తున్న మాజీ మంత్రి సెంజి మస్తాన్ - కాంచీపురం, న్యూస్‌టుడే

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి ఎటువంటి దర్శన టికెట్లు లేకుండా తిరుమలకు వచ్చిన భక్తులు ఆదివారం సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 15 కంపార్ట్‌మెంట్లులో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 8 గంటల్లో స్వామివారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. అదేవిధంగా రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు ఆరు కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. వీరికి దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది.

వర్షానికి 10 వేల ఎకరాల్లో పంట నష్టం

పొన్నేరి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మీంజూరు, చోళవరం, జగన్నాథపురం, కల్పాక్కం, దేవదానం, వేళూర్, కాట్టూరు, తత్తంమంజేరి, మడిమైకండ్రిగ, కోళూరు, పెరియ కరుంబూరు, ఇలుపాక్కం, కుమరంజేరితో పాటు 20 గ్రామాల్లో 10 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి, ఇతర పంటలు నీట మునిగాయి. పూర్తిగా నష్టపోయిన తమకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కార్తిక దీపోత్సవాలకు
సిద్ధమవుతున్న సువర్ణముఖి తీరం



నదీ తీరాన్ని శుభ్రం చేస్తున్న శుభ్రతా కార్మికులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో సువర్ణముఖి నదీ తీరంలో భక్తులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు వీలుగా ఆలయ అధికారులు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నదీ తీర ప్రాంతంలో వ్యర్థాలను తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించే పనుల్లో శుభ్రతా కార్మికులు నిమగ్నమయ్యారు. వ్యర్థాల తొలగింపుతో నదీ తీరం సుందరంగా కనిపిస్తోంది. పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా తీరాన్ని సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది.

ఘనంగా సంకటహర చతుర్థి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంకటహర హోమాన్ని ఆగమోక్తంగా జరిపారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలోని అంజి అంజి వినాయక స్వామి ఆలయం వద్ద ఆదివారం వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. వెండి ఉడుపులతో అలంకరణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అలంకరణలో నాట్య గణపతి



అరెస్టయిన నిందితులు

ఇరిడియం పేరిట మోసగించిన
నలుగురి అరెస్టు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం పాలక్కాడుకు చెందిన అబ్దుల్‌అజీజ్ భూస్వామి. ఈయన్ను కోవైకి చెందిన అబూబక్కర్, జాన్‌పీటర్, సెంథిల్‌రాజ్, జగన్ అనే వ్యక్తులు కొద్ది రోజుల క్రితం సంప్రదించారు. తమ వద్ద బంగారం, ప్లాటినం, బిట్‌కాయిన్ల కన్నా అధిక ధర పలికే ఇరీడియం ఉందని చెప్పి ఏదో ఓ వస్తువును చూపించారు. దాని ధర రూ.10 కోట్లని, రూ.2 కోట్లు చెల్లిస్తే అందజేస్తామని నమ్మబలికారు. నిజమని నమ్మిన అబ్దుల్ అజీజ్ వారికి రూ.2 కోట్లను ఇచ్చాడు. కానీ వారు ఇరీడియం అందజేయలేదు. మోసమోయినట్లు గ్రహించిన బాధితుడు కోవై ఆర్ఎస్‌పురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు నలుగురిని ఆదివారం అరెస్టు చేశారు.

చోరీకి యత్నించిన ముగ్గురు...

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి సమీప తండవచ్చేరిలో మూతపడ్డ కర్మాగారం ఉంది. ఇందులో శనివారం రాత్రి కొందరు ప్రవేశించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని కర్మాగారంలోని సామగ్రిని చోరీ చేసేందుకు యత్నిస్తున్న వళుదిలంబేడుకు చెందిన మురుగన్, ప్రకాష్, మురళి అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

నగదు, నగల చోరీ

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప పెరియకరుంబూరుకు చెందిన తంగరాజ్ రైతు. ఇతను తన కుటుంబంతో కలిసి చెన్నై తండయారుపేటకు వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. తాళం పగులగొట్టి ఉండటంతో లోనికెళ్లి చూడగా 12 సవర్ల బంగారు నగలు, రూ.9 వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుమ్మిడిపూండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలాశయంలో మునిగి ముగ్గురు బాలికల మృతి

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా నంగవల్లి ప్రాంతంలోని జలాశయంలో స్నానానికి దిగి ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... వీరక్కల్ ప్రాంతానికి చెందిన రేవతి (20), శివశ్రీ (10), దివ్యదర్శిని (14) ఆదివారం ఉదయం కొత్తికుట్టై వద్ద జలాశయంలో స్నానం చేసేందుకు వెళ్లారు. శివశ్రీ, దివ్యదర్శిని లోతుకు వెళ్లడంతో నీట మునిగారు. వారిని రక్షించేందుకు దిగిన రేవతి కూడా మునిగిపోయింది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాలించి మృతదేహాలను వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

లారీ ఢీకొని ఎస్సై...

ఆర్కేనగర్: తంజావూర్ జిల్లా పట్టుకోట్టై వలవన్‌పురానికి చెందిన సెంథిల్‌కుమార్ (49) పటుకోట మదుక్కూర్ ప్రాంతంలో క్రైమ్ ఇంటెలిజెన్స్ ప్రత్యేక విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం తంజావూర్ తమిళ్ వర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ రాక నిమిత్తం భద్రతా విధులకు ఆయన హాజరయ్యారు. విధులు ముగిసిన తర్వాత తిరిగి రాత్రి ద్విచక్రవాహనంపై పట్టుకోటకు బయలుదేరారు. కరంబయం ప్రాంతంలో లారీ ఢీకొనడంతో సెంథిల్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సెంథిల్‌కుమార్ (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

విల్లివాక్కం: కోవై నుంచి ఈరోడ్ జిల్లా సత్యమంగళంకు 40 మంది ప్రయాణికులతో ఓ ప్రభుత్వ బస్సు శనివారం సాయంత్రం బయలుదేరింది. డ్రైవర్ శివలింగం. పున్‌సెయ్‌పులియంపట్టి సమీపంలోని మలుపులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ బస్సు కుడివైపు బలంగా ఢీకొంది. ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ గణేశన్ (35), బస్సులోని 10 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను సత్యమంగళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా కొండప్పనాయకన్‌పాలయానికి చెందిన పళనిసామి కుమారుడు నతీష్ (21) మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

తేయాకు యంత్రంలో చిక్కుకుని కార్మికుడు...

ఆర్కేనగర్: తేయాకు గ్రైండింగ్ యంత్రంలో చిక్కుకుని ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు... తిరుచ్చికి చెందిన శివకుమార్ (51) తేయాకు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం ఇతను తేయాకు గ్రైండింగ్ యంత్రం శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అతను ధరించిన టీషర్ట్ యంత్రంలోని బెల్ట్ వైర్‌లో చిక్కుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

నగల కోసం వృద్ధురాలి హత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని నగల కోసం దుండగులు దారుణంగా నరికి చంపిన ఘటన తిరుప్పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలోని కారణంపేట ప్రాంతానికి చెందిన కన్నమ్మాల్ (65) భర్త సుబ్బయ్యన్ మృతి చెందాడు. వీరి ముగ్గురు పిల్లలకు వివాహాలై వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కన్నమ్మాల్ ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంట్లోకి చొరబడిన దుండగులు ఆమె కళ్లలో కారంపొడి చల్లి కాళ్లుచేతులు కట్టేశారు. అనంతరం బీరువాలో ఉన్న నగలు, నగదు తీసుకొని పారిపోయారు. ఆదివారం ఉదయం ఎంతసేపటికీ ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా కన్నమ్మాల్ విగతజీవిగా కనిపించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి దూకి ఖైదీ ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెట్టు పైనుంచి దూకి ఖైదీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పుదుకోట్టైలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తంజావూర్ జిల్లా పట్టుకోట్టై సమీప తురైవిడకాడు గ్రామానికి చెందిన సిద్ధర్‌వేల్ (21)ను పశువుల చోరీ కేసులో అరంతాంగి పోలీసులు అరెస్ట్ చేసి 5వ తేదీ పుదుకోట్టై జైల్లో ఉంచారు. ఇదిలా ఉండగా శనివారం సిద్ధర్‌వేల్ జైలు ప్రాంగణంలోని చెట్టు పైకెక్కి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

200 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్లే వాహనాల్లో కొందరు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఎళావూరులో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యానులో అరటి ఆకుల కింద దాచిన 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మోహన్‌రాజ్, షణ్ముగనాథన్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

జైలు ఖైదీ నుంచి...

రెడ్‌హిల్స్: పుళల్ కేంద్ర కారాగారంలో పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇమ్రాన్ అనే ఖైదీ గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. అతని నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పుళల్ పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా పేలుడు పదార్థం...

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీప కోవిల్‌పత్తు ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని ఆపి సోదా చేశారు. లారీలో 40 బస్తాల్లో టన్ను బరువున్న పేలుడు పదార్థం గుర్తించారు. డ్రైవర్ వద్ద దర్యాప్తు జరిపారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. పుదుచ్చేరికి చెందిన డ్రైవర్ మణిగండన్ (30)ను అరెస్టు చేశారు.



స్వాధీనం చేసుకున్న లారీ

తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని కర్ణాటక భవనం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగుచూసింది. తిరుమల వన్‌టౌన్ పీఎస్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న ఓ వ్యక్తి గుండు చేయించుకుని కర్ణాటక భవనం సమీపంలోని ఓ ఇనుప స్టాండ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియలేదు. తెల్లని పంచె, చొక్కా ధరించి ఎడమచేతికి డిజిటల్ వాచ్, ఎడమచేయి మోచేతిపై నుంచి భుజాల వరకు వినాయకుడి పచ్చబొట్టు, కుడిచేతిపై హనుమంతుని పచ్చబొట్టు ఉన్నాయి. అనంతరం మృతదేహాన్ని తితిదే అశ్విని ఆసుపత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు తిరుమల వన్‌టౌన్ పీఎస్ సీఐ సెల్ నెం.94407 96769, ఫోన్ నెం.0877-2289027ను సంప్రదించాలని కోరారు.